చెరువును చెరబట్టారు..

- పట్టించుకోని ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు
- కనుమరుగు కానున్న రాళ్లగూడ జోషికుంట చెరువు

శంషాబాద్‌రూరల్, జనవరి 7: చెరువును కబ్జాదారులు చెరబడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అటు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో కబ్జాదారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ జోషికుంట (చెరువు) ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉండడంతో కబ్జారాయుళ్లు ఆనవాళ్లు లేకుండా చెరువులో మట్టిపోసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆదివారం కావడంతో అదే అదనుగా భావించిన కబ్జారాయుళ్లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడ జోషికుంట చెరువు 325 సర్వే నంబర్ 7 ఎకరాల 29 గుంటల విస్తీర్ణంలో ఉంది. కానీ ప్రస్తుతం ఇక్కడ ఎకరం భూమికి మించి లేదని స్థానికులు చెబుతున్నారు. చెరువులను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లగూడలో మట్టితో నింపేసిన చెరువు

జోషికుంట చెరువులో చేపడుతున్న అక్రమ నిర్మాణం

ఆరు నెలల క్రితం అలుగు ధ్వంసం

చెరువును అన్యాక్రాంతం చేయడం కోసం కబ్జారాయుళ్లు చెరువులో నీరునిలువ ఉండకుండా అలుగును ఆరునెలల క్రితం ధ్వంసం చేసి నీరు కిందకుపోయేలా చేశారు. పై భాగంలో నుంచి చెరువులోకి వచ్చేనీరు ఎప్పటికప్పుడు కిందకు వెళ్లేలా చేశారు. దీంతో పాటు చెరువు ప్రాంతంలో మట్టిని పోసి నిర్మాణాలకు సిద్ధం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కబ్జారాయుళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసిన చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

చెరువులో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఆదేశాలు జారీ చేసినా వారు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆదివారం పనులు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వారిపై చర్యలు తీసుకుంటాం.

–ఇరిగేషన్ ఏఈ మౌనిక

కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్ డివిజన్ బీఆర్ఎస్ బూత్ కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్,జనవరి 7: నిరంతరం ప్రజల్లో ఉండటంతో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హామీ ఇచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెంగళ్‌రావునగర్ డివిజన్ బూత్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాగంటి పాల్గొని ఇటీవల ఎన్నికల్లో బూత్ వారీగా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గతంతో పోలిస్తే ఎక్కువ ఓట్లను బీఆర్ఎస్ సాధించగలిగిందన్నారు. కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా బీఆర్ఎస్ తరపున ఒత్తిడి తీసుకొద్దామని సూచించారు. సమావేశంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యరావు, బీఆర్ఎస్ డివిజన్ నాయకులు రామకృష్ణ, డాక్టర్ అఫ్తాబ్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనూప్ చక్రవర్తికి సన్మానం

తిరుమల తిరుపతి దేవస్థానం లోకల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు అనూప్ చక్రవర్తి ఆదివారం రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అందిస్తున్న సామాజిక సేవలపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అత డిని శాలువాతో సత్కరించారు. – ఖైరతాబాద్, జనవరి 7

మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

సకల శుభాలు చేకూర్చే పండుగ సంక్రాంతి

- ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతుల ప్రదానం

వెంగళరావునగర్,జనవరి 7: సకల శుభాలు చేకూర్చే పండుగ సంక్రాంతి అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఆదివారం రహ్మత్‌నగర్ డివిజన్ ఇందిరానగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా మహిళలను అభినందించి వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో హీరో నిఖిల్ సిద్ధార్థ్ సందడి

బంజారాహిల్స్,జనవరి 7: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11లో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొని టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ సందడి చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగం

బంజారాహిల్స్, జనవరి 7: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పుష్పయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు తీసుకొచ్చిన వేలాది పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేయడంతో పాటు విశేష పూజలు నిర్వహించారు.

17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న జై భీమ్ శ్రీనివాస్

ఖైరతాబాద్, జనవరి 7: బహుజనుల రాజ్యాధికారం సాధించడం ద్వారానే ఆ వర్గాలు అభివృద్ధి చెందుతాయని తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అధ్యక్షులు జై భీమ్ శ్రీనివాస్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని, కేంద్రం అందుకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ రాష్ట్రంలోని 17స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మణికొండ కురుమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కురుమ సంఘం అధ్యక్షులు బి.ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి సి.బీరప్ప, మండల అధ్యక్షులు ఈ.యాదయ్య, వైస్ చైర్మన్ బి.శ్రీరాములు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. –మణికొండ, జనవరి 7

రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి మంగతాయారు, ఉప కమిషనర్ రవికుమార్

టార్గెట్ 17

- ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ షురూ
- ప్రత్యేకంగా ఆపరేటర్లకు శిక్షణ
- పథకాల వారీగా దరఖాస్తుల నమోదు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- ఈనెల 17లోగా పూర్తి చేయడమే లక్ష్యం

బంజారాహిల్స్, జనవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీలను ప్రజలకు అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముగియడంతో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో 22 కౌంటర్లలో తీసుకున్న దరఖాస్తులను డివిజన్ల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సర్కిల్ 18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల నుంచి అభయహస్తం కింద 47,697 దరఖాస్తులు రాగా రేషన్ కార్డులు, ఇతర సమస్యలకు సంబంధించి 16,332 దరఖాస్తులు అందాయి. సర్కిల్ –17 పరిధిలోని ఖైరతాబాద్, సోమాజిగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల నుంచి అభయహస్తం కింద 35,624 దరఖాస్తులు రాగా రేషన్ కార్డులు,ఇతర సమస్యల గురించి 12,808 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి చేర్చిన అధికారులు వాటిని ఆన్‌లైన్‌లోకి ఎట్రీ చేయిస్తున్నారు. ఇప్పటికే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఇవ్వడంతో నేరుగా పోర్టల్‌లో ఎంట్రీ చేస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 17లోగా అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లోకి నమోదు చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. దరఖాస్తుఫారమ్‌లోని ఆధార్ నంబర్ ఆధారంగా ఏ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారో వాటిని వేర్వేరుగా అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే కుటుంబంలోని వ్యక్తులు వేర్వేరుగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడంతో అలాంటి దరఖాస్తులను గుర్తించడం కష్టమైన పనేనని సిబ్బంది అంటున్నారు.

డాటా ఎంట్రీని సమర్థవంతంగా చేపట్టండి

బండ్లగూడ : ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సమర్థవంతంగా ఎంట్రీ చేయాలని ప్రజాపాలన రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ప్రత్యేక అధికారి మంగతాయారు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆమె రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌తో కలిసి జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె దరఖాస్తు ఫారాల్లో వివరాలను తప్పులు లేకుండా ఎంట్రీలు చేయాలని, ఎంట్రీలను త్వరగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

చేవెళ్లకు తరలిన బీఆర్ఎస్ నేతలు

ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న ముఖ్రమ్ ఖాన్, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 07: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలకు రాజేంద్రనగ్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ ఎండీ ముఖ్రమ్ ఖాన్, షేక్ నయ్యూమ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు వెళ్లి ఆదివారం ఉచిత వైద్య సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్, జాకీర్‌బాయ్, సురేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం.. కేసు నమోదు

బంజారాహిల్స్,జనవరి 7: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నంబర్ 102/1లో టీఎస్ నంబర్ 5, బ్లాక్–జే, వార్డు–12లోకి వచ్చే హకీంపేట విలేజ్‌లో ఎమ్మెల్యే కాలనీకి కింది భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని హెచ్ఎండీఏకు గత ప్రభుత్వాల హయాంలో అప్పగించారు. ఈ స్థలంలోని కొంతభాగంలో గతంలో సలీమ్, ఈశ్వర్, షేక్ జకీర్ అనే వ్యక్తులు ఆక్రమించుకుని గదుల నిర్మాణం చేపట్టగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని కూల్చివేశారు. ఈ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. అయితే తాజాగా మరోసారి సదరు వ్యక్తులు షెడ్ల నిర్మాణం చేపట్టడంతో కూల్చివేశారు. ఈ నేపథ్యంలో ఎన్నిసార్లు హెచ్చరించినా తిరిగి ఆక్రమణలకు పాల్పడుతున్న నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని షేక్‌పేట తహసీల్దార్ అనితా రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిపై పలు యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో సైబర్ మోసం

బంజారాహిల్స్,జనవరి 7: పార్ట్‌టైమ్ జాబ్ కోసం చూస్తున్న యువతిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నం 12లో నివాసం ఉంటున్న శైలజ మాదాపూర్‌లో డిజైనర్‌గా పనిచేస్తుంది. పార్ట్‌టైమ్ జాబ్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్న క్రమంలో ఈనెల 3న గుర్తుతెలియని నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. గూగుల్ రివ్యూస్, టాస్క్స్ పూర్తి చేస్తే డబ్బులు వస్తాయని నమ్మించడంతో పాటు ముందుగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని తెలిపారు.తమ ఇన్‌స్టాగ్రామ్ గ్రూపులో యాడ్ చేసి జాబ్‌కు సంబంధించిన వివరాలు చెప్పారు. దీంతో వారి మాటలు నమ్మిన శైలజ రూ.27వేలు పెట్టుబడిగా పంపింది. అయితే రోజులు గడిచినా డబ్బులు తిరిగి రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి ఆదివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్మికులకు అండగా ఉంటా

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 7 : పారిశ్రామిక వాడలో పనిచేసే బాధిత కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నాడు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలో వేద రెడిమిక్స్ లారీ ఓనర్ రాజు వద్ద ఎండీ జాఫర్ అనే కార్మికుడు గత కొన్నేండ్లుగా పనిచేసి మానేశాడు. అతడికి రావాల్సిన వేతనం ఇవ్వడంలో లారీ ఓనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించగా.. బాధితుడు రవిసింగ్‌ను ఆశ్రయించాడు. కాగా.. ఆదివారం లారీ ఓనర్‌తో మాట్లాడి జాఫర్‌కు రావాల్సిన రూ.30 వేలు వేతనం డబ్బులను ఇప్పించాడు.

సీసీ కెమెరాలు ప్రారంభం

మియాపూర్ డివిజన్ ఎస్ఆర్ ఎస్టేట్స్ గేటెట్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న 116 సీసీ కెమెరాలను సెక్టార్ ఎస్ఐ రాజు ఆదివారం ప్రారంభించారు.

– మియాపూర్, జనవరి 7

బీసీ 'ఏ'లో చేర్చే వరకు ఉద్యమిస్తాం..

- తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర

మణికొండ, జనవరి 7: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సమాజంలో అన్ని రంగాల్లో వెనకబాటుకులోనైనా సగర కులాన్ని బీసీ ఏలో చేర్చే వరకు రాష్ట్ర వ్యాప్తంగా సగర జాతి ఉద్యమిస్తుందని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మణికొండ సగర సంఘం 2024 నూతన సంవత్సర కాలెండర్ ఆవిష్కరణ, సంఘం నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సంఘం అధ్యక్షుడు దేవేందర్ సగర అధ్యక్షతన నిర్వహించిన సభలో శేఖర్ సగర మాట్లాడుతూ బీసీ డీలో ఉండటంతో రిజర్వేషన్లు లేక సగరులు విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు నర్సింహ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్యసగర, గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం అధ్యక్షుడు సీతారాం సగర, సంఘం గౌరవ అధ్యక్షుడు మహాదేవ సగర, వెంకటేశ్వర్లు సగర, సలహాదారులు అశోక్ సగర, వెంకటేశ్‌సగర, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ సగర, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ సగర, కోశాధికారి గోపి సగర, మహిళా సంఘం అధ్యక్షురాలు రోజా సగర, ప్రధాన కార్యదర్శి సునీత సగర, ఫిలింనగర్ సగర సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ సగర, తదితరులు పాల్గొన్నారు.

మణికొండలోని సగర సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర, తదితరులు

శ్రీరామ జన్మభూమి అక్షింతలు పంపిణీ

దుండిగల్, జనవరి 7 : అయోధ్యలోని శ్రీరామజన్మభూమి పూజిత అక్షింతలను అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ దంపతులు ధన్‌రాజుయాదవ్, ప్రణయ అన్నారు. ఆదివారం శ్రీరామ తీర్థక్షేత్ర, ప్రగతినగర్ సంచాలన సమితి ప్రతినిధులు అక్షింతలతోపాటు స్వామివారి చిత్రపటాలను డిప్యూటీ మేయర్ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిహిందువు కుటుంబానికి స్వామి వారి అక్షింతలు అందాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.ఎంఆర్ఎస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ డిప్యూటీ మేయర్ దంపతులకు అక్షింతలు అందజేస్తున్న శ్రీరామ తీర్థక్షేత్ర సంచాలన సమితి ప్రతినిధులు

కేపీహెచ్‌బీ కాలనీలో...

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 7 : అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్రం ట్రస్ట్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ కాలనీ శ్రీవేంకటేశ్వర బస్తీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో ఇంటింటికి తిరిగి శ్రీరాములవారి అక్షింతలను పంపిణీ చేశారు.ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పూజలు చేయాలని తెలంగాణ హిందూ సేవా సమితి అధ్యక్షుడు కట్టా నరసింగరావు కోరారు. కార్యక్రమంలో సత్తిరాజు, మహేశ్, రఘురామ్, శంకర్, గోలి పద్మారెడ్డి, భారతి, శోభ, కమలమ్మ, విద్య తదితరులున్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు..

- 'జమాతే ఇస్లామి హింద్' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ఎర్రగడ్డ, జనవరి 7: ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు అన్నీఇన్నీ కావని.. వాటి జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకో వద్దని వక్తలు పేర్కొన్నారు. 'జమాతే ఇస్లామి హింద్'(జూబ్లీహిల్స్ శాఖ) ఆధ్వర్యంలో ఆదివారం బోరబండలో డగ్స్ వ్యతిరేక సదస్సును నిర్వహించారు. సైట్–3 జయశంకర్ కమ్యూనిటీహాల్లో జరిగిన ఈ సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ టీనేజ్ వయసులోనే డగ్స్‌ను అలవాటు చేసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం బోరబండ పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. అనంతరం పలువురు పెద్దలను సంస్థ ప్రతినిధులు జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో ఖాలిదాపర్వీన్,మహ్మద్ అజారుద్దీ, రుక్ముద్దీన్, నాజిమా తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న అబ్దుల్ రషీద్

జాతీయ మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడిగా చిరంజీవి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 7: జాతీయ మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నీలం చిరంజీవి నియమితులయ్యాడు. కూకట్‌పల్లి బాలానగర్‌లో జరిగిన మాల మహానాడు విస్తృత స్థాయి సమావేశంలో అధ్యక్షుడు అద్దంకి దయాకర్, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌లు చిరంజీవికి నియామక పత్రాన్ని అందజేశారు.

అంతర్ జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపిక

దుండిగల్, జనవరి 7 : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న 49వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొనే మేడ్చల్ జిల్లా బాల, బాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో ఆయా జట్ల తరపున పోటీలో పాల్గొనే క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. అకాడమీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజు, ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజు సమక్షంలో క్రీడాకారుల ఎంపిక చేశారు. బాలురు జట్టుకు 12 మంది, బాలికల జట్టుకు 14 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సాట్స్ డీఎస్‌డీవో సుధాకర్, నేషనల్ కోచ్ మాణిక్‌రాజ్, మహిళా కోచ్‌లు, మేనేజర్ షకీల్ పాల్గొన్నారు.